**హాస్పిటల్ అంటే నా కసహ్యం. అక్కడ రోగులు ఏ మహాశక్తి చేతుల్లోనో గిజగిజలాడుతున్నట్టు కన్పిస్తుంది నాకు. అక్కడ రకరకాల వ్యాధులు మనిషిని పీడించే దృశ్యం కన్పిస్తుంది.**

అక్కడ మృత్యువు కన్పిస్తుంది. బతుకులోని భయంకరత్వం కన్పిస్తుంది. అందుకే హాస్పిటల్ అంటే నా కసహ్యం. కానీ నా భార్యకి జాండిస్ వచ్చినప్పుడు హాస్పిటల్ కి వెళ్ళక తప్పలేదు. జాండిస్ కేసుల్ని ట్రీట్ చెయ్యడంలో డాక్టర్ పరశురామయ్య ప్రసిద్ధుడని తెలిసి ఆయన వద్దకి వెళ్ళాం.

శాంతి నర్సింగ్ హోమ్ పట్నానికి పెడగా ఓ చివరన ఉంది. అక్కణ్నించి పొలాలు మొదలవుతాయి. టౌనుకి అంత దూరంగా అంత పెద్ద హాస్పిటల్ ఎందుకు కట్టించాడో ఆ డాక్టరుకే తెలియాలి. మేం వెళ్ళేసరికి కన్సల్టింగ్ రూం దగ్గర హడావుడిగా వుంది. సాధారణంగా దీర్ఘరోగులే ఆ హాస్పిటల్ కి ఎక్కువగా వస్తుంటారు. ఒక కాంపౌండరూ మరో నర్సూ అటూ ఇటూ తిరుగుతున్నారు. దాదాపుగా అరగంట తర్వాత మాకు ప్రవేశం దొరికింది. డాక్టర్

# హింసరచన

**పాపినేని శివశంకర్**



అప్పుడే బేసిన్ లో చేతులు కడుక్కుని తువ్వాలుతో తుడుచుకుంటున్నాడు. మేం విష్ చేశాక రివాల్వింగ్ ఛైర్ లో కూర్చుని మమ్మల్ని కూర్చోమని సైగ చేశాడు. డాక్టర్ పరశురామయ్యకి ఏభై ఏళ్ళలోపుండొచ్చు. తెల్లగా బొద్దుగా వున్నాడు. అప్పుడే తీసిన బ్లేడులా చురుగ్గా వున్నాడు. అప్పుడే కోసిన టొమాటోలా తాజాగా వున్నాడు. తల అక్కడక్కడా నెరిసింది. ముఖం ప్రసన్నంగా వుంది. ఆయన్ని చూసీ చూడగానే సద్భావం కలిగింది నాకు. పరీక్ష చేసిన తర్వాత మమ్మల్ని సూటిగా అడిగాడు.

"ఇంత ముదిరిపోయేదాకా ఏంచేస్తున్నారు ట్రీట్ మెంటు తీసుకోకుండా?"

ఇంతకుముందు మరో డాక్టర్ కి చూపించినట్టు చెప్పాను నేను.

"ఎవరికో చూపించినట్టు చెబుతారేం? టౌన్ లో జాండిస్ స్పెషలిస్టులు ఎవరో తెలీదా మీకు? ఆల్ రైట్. ముందీ పరీక్షలు చేయించుకురండి" అని అధికారపూర్వకంగా అన్నాడు డాక్టర్.

యూరిన్ టెస్ట్, బ్లడ్ టెస్ట్, ఎల్.ఎఫ్.టి. వగైరా పరీక్షలు ముగించుకుని రిపోర్టుల్తో మళ్ళీ ఆయన వద్దకు వచ్చాం. రిపో

ర్థులన్నీ ఒకసారి తిరగేశాడు.

"మైగాడ్! ఎల్.ఎఫ్.టి. ఫిఫ్టీన్ మిల్లీ గ్రామ్స్ చూపిస్తోంది. వెరీ హై. ఇమ్మీడి యెట్‌గా హాస్పిటల్‌లో అడ్మిట్ కండి. జాగ్రత్తగా ట్రీట్ చెయ్యాలి. తగ్గడానికి ఎన్నాళ్ళు పడుతుందో ఇప్పుడే చెప్పలేను. బట్, డోంట్ వర్రీ. యూ విల్ బి ఆల్‌రైట్" అన్నాడు నా భార్యనుద్దేశించి.

సుగుణ ఆందోళనపడుతున్నట్టు కనిపిస్తోంది. డాక్టర్ మాటలకి యాంత్రికంగా తల వూపింది. నేను భుజం తట్టాను భయపడవద్దన్నట్టు. కానీ నాకూ లోలోపల విచారంగానే వుంది.

"మీరేం చేస్తుంటారు?" అడిగాడాయన నన్ను.

ఫలానా కాలేజీలో లెక్చరర్‌నని చెప్పాను. ఆయన నవ్వి తన కూతురు ఆ కాలేజీలోనే థర్డ్ బీయస్సీ చదువుతున్నట్టు చెప్పాడు. ఆ క్లాసుకూ్కడా వెళ్తుంటాను నేను. బ్రిలియంట్ స్టూడెంటే.

మర్నాడు ఉదయమే సుగుణ హాస్పిటల్‌లో అడ్మిట్ అయింది. కాలేజీకి సెలవులు కావడంవల్ల ఆమెని కనిపెట్టుకుని వుండడానికి నాకు అవకాశం చిక్కింది. తోడుగా అత్తయ్య వుండటంచేత వంటకి ఇబ్బంది లేదు. హాస్పిటల్ గది ఓ మాదిరిగా వుంది. ఫ్యాన్ లేకపోవడంవల్ల సుగుణ నలుక్కుంది. గదిలో చేరటంతోటే చుట్టుపక్కల వాళ్ళ పలకరింపులయ్యాయి. కుడిపక్క 14వ నెంబరు గదిలో జాండిస్ కేసే. 16వ నెంబరు గదిలో ఎవరున్నారో ఇంకా తెలియలేదు. ఉండుండి ఎవరో స్త్రీ దగ్గుతున్నట్టు మాత్రం వినిపిస్తోంది. ఆ దగ్గుతున్న మనిషి తీవ్రంగా బాధపడుతూ వుండాలి. దగ్గు తెరలుతెరలుగా శరీరాన్ని చీల్చుకు వస్తున్నట్టుంది. సుగుణ ఆరోగ్యాన్ని గూర్చిన విచారంతో పాటు మరేదో విషాదం నన్నావరించసాగింది.

హాస్పిటల్ ఆవరణలోనే మెడికల్‌షాపు కూడా వుంది. డాక్టరు రాసిన మందులు తెచ్చాను. కొన్ని రోజులపాటు లిక్విడ్ ఫుడ్ తప్ప మరేమీ తీసుకోవద్దని చెప్పాడు. డెక్స్ట్రన్ టాబ్లెట్ వేసుకుని పళ్ళరసం తాగింది సుగుణ. కొత్త వాతావరణం కావడంవల్ల రోజంతా నాకేమీ తోచలేదు. రాత్రి కూడా సరిగా నిద్ర పట్టలేదు. అర్ధరాత్రి అవుతుండగా—ఎందుకో హఠాత్తుగా మెలుకువ వచ్చింది. పక్క గదిలోంచి ఖంగు ఖంగున గోడల్ని చీల్చుకు వస్తున్న దగ్గు. తెరలు తెరలుగా ఆగి ఆగి ఉధృతంగా వినిపిస్తోంది. దగ్గుతెరల మధ్య బాధగా ఆయాసంగా కొన్ని మాటలు.

"అబ్బా! అమ్మో! ఈ బాధ భరించలేను.... ఉహ్.... భగవంతుడా! నన్ను తీసుకుపో."

నా నిద్ర పూర్తిగా తేలిపోయింది. ఆ మాటలు వింటూ భరించలేకపోయాను. ఒక్క ఉదుటున తలుపుతీసి 16వ నెంబరు గది ముందుకి వచ్చాను. తలుపులు ఓరగా వేసి వున్నాయి. నెట్టుకుని లోనికి అడుగు పెట్టేసరికి భయంకరమైన దృశ్యం కనిపించింది. అస్తవ్యస్తంగా వున్న బెడ్‌మీద ఎడతెరిపి లేకుండా దగ్గుతున్న అస్తిపంజరం. సుమారు ముప్పై అయిదేళ్ళ ఆ అస్తిపంజరం నోటివెంట కళ్ళెతో పాటు రక్తం జీర. చింపిరి తల. మాసి చిరుగులు పడ్డ చీర. మెళ్ళో రంగు వెలిసిన పసుపుతాడు. గదంతా ఏదో చిత్రమైన వెగటు పుట్టించే వాసన. ఆమె కెదురుగా భర్త కాబోలు మౌనంగా నిలబడి తడిగుడ్డతో ముఖం తుడుస్తున్నాడు. ఆమె పరిస్థితి ఆందోళనకరంగా వుందని అర్థమవుతోంది.

"డాక్టర్ని కేకేద్దామా?" అని అడిగాను.

అతను ఓసారి నావైపు చూసి మళ్ళీ తన పనిలో నిమగ్నమయ్యాడు.

"నేను వెళ్ళి పిలుచుకురానా?" మళ్ళీ రెట్టించాను.


అతనేమీ సమాధానం ఇవ్వలేదు. ఆమె మెల్లగా తలతిప్పి నా వంక కృతజ్ఞతగా చూసింది. గుంటలుపడ్డ ఆ కళ్ళలో ఎక్కడో ప్రాణం కదలాడుతున్నట్టు అనిపిస్తోంది. అతను అందివ్వగా ఏవో రెండు మాత్రలు మింగి అలసటగా కళ్ళు మూసుకుంది. అతను పల్లగా బక్కపలచగా వున్నాడు. నలభై అయిదేళ్ళుండొచ్చు. ముఖం మొరటుగా నిబ్బరంగా వుంది. ముక్కు ముందుకి పొడుచుకు వచ్చింది. చూపులు తీవ్రంగా వున్నాయి. నేనొక్కనిముషం అలాగే నిలబడి వచ్చేశాను. మిగిలిన రాత్రంతా కలతనిద్రతోనే గడిచిపోయింది. దానికి తోడు దోమల బాధ విపరీతంగా వుంది.

ఉదయం తొమ్మిదింటికి డాక్టర్ రౌండ్సుకి వచ్చాడు. జాండిస్ బాగా తగ్గుముఖం పట్టేదాకా రోజూ సెలయిన్ ఎక్కించాలని చెప్పాడు. మరోసారి ఏమీ భయపడవద్దని చెప్పి పక్క గదికి నడిచాడు. అక్కడి మాటలు స్పష్టంగా వినబడుతున్నాయి. ఆమె రాత్రంతా నిద్ర లేదనీ, విపరీతంగా దగ్గు వస్తోందనీ చెబుతోంది. డాక్టర్ మరో రకం టాబ్లెట్స్ రాసిస్తున్నట్టు చెప్పి పక్క గదికి వెళ్ళిపోయాడు. కాసేపటికి కాంపౌండర్ వచ్చాడు. ఆయన పేరు హనుమంతరావు. ఎర్రగా పొట్టిగా చురుగ్గా వున్నాడు. సెలయిన్ స్టాండ్ అమర్చుతుండగా సుగుణ అడిగింది-గదుల్లో ఫ్యాన్లు లేవేమని. హనుమంతరావు నవ్వుతూ సమాధానంచెప్పాడు.


"ఫ్యాన్లుంటే ఎక్కువ కరెంటు కాలుతుందని డాక్టర్‌గారికి భయమండీ. కావాలంటే మీరు టేబుల్ ఫ్యాన్ తెచ్చుకోవచ్చు. ఎక్స్‌ట్రా బిల్లు వెయ్యరని మాత్రం నేను గ్యారంటీ ఇవ్వలేను."

"ఇది మరీ బావుంది. గదుల్లో కరెంట్ బల్బులు కూడా తీసేస్తే ఇంకా ఖర్చు కలిసొస్తుందిగా" అంది సుగుణ. హనుమంతరావు మళ్ళీ నవ్వాడు. సుగుణకి ఇన్సులిన్ ఎక్కించి సెలయిన్ పెట్టి పక్క గదులకి వెళ్ళాడు. నేను మాత్రం డాక్టర్ గురించి తొందరపడి చెడుగా ఊహించలేకపోయాను.

రెండురోజులు గడిచేసరికి హాస్పిటలంటే నాకు కొత్తదనం పోయింది. హాస్పిటల్ చాలా పెద్దది. చక్కని ప్లాను ప్రకారం కట్టించబడింది...డాక్టర్ కన్సల్టింగ్ రూంకి అటూ ఇటూ రెండు వింగులుగా రోగులకి గదులున్నాయి. పై అంతస్తులో అన్నీ ఎయిర్ కండిషన్డ్ గదులే. సాధారణంగా హాస్పిటల్‌కి దీర్ఘ రోగులు తప్ప ఆపరేషన్ కేసులురావు. హాస్పిటల్‌కి ఎదురుగా



దాదాపు మూడెకరాల భూమి ప్లాట్లుగా రాళ్ళు పాతబడి వుంది. ఆ తర్వాత కనుచూపు మేరంతా పచ్చటి పొలాలు. అప్పుడప్పుడు దూరంగా గ్రాండ్ ట్రంక్ రోడ్డు మీద వెళ్ళే వాహనాల ధ్వని తప్పించి వాతావరణం ప్రశాంతంగా వుంటుంది. నాకు ధ్వని కాలుష్యంలేని ప్రదేశం బాగా నచ్చుతుంది. సుగుణని మాటిమాటికి బెడ్ దిగొద్దని డాక్టర్ చెప్పడంవల్ల బయటి చక్కటి వాతావరణం చూస్తూ ఆనందించే అవకాశం అంతగా లేదు. టేబిల్ ఫ్యాను తెచ్చుకున్నా స్వైర విహారం చేసే ఏనుగులంతేసి దోమలతో సతమతమవుతోంది. గదుల్లో ఫ్యాను పెట్టించనందువల్ల సుగుణకి డాక్టరంటే గురిపోయింది.




ఆ రోజు మధ్యాహ్నం భోజనం ముగించాక రూం బయట వరండాలో కుర్చీలో కూర్చుని నాతో తెచ్చుకున్న ఓ పుస్తకం చదువుతున్నాను. రెండు రోజుల్లో దాని మీద రివ్యూ రాసి పత్రిక్కి పంపాలి. జార్జి విల్సన్ రాసిన "వాట్ ఈజ్ వయొలెన్స్?" అనే పుస్తకం అది. సామాజిక వ్యవస్థ లోని హింసా స్వభావాన్ని, అది కొనసాగే విధానాల్ని హేతుబద్ధంగా విశ్లేషిస్తున్నాడు. నేనా పుస్తకంలో లీనమయ్యేలోగా 16వ నెంబరు గదిలోంచి ఆ రోగిష్టి స్త్రీ భర్త వచ్చాడు. పలకరింపుగా నవ్వాను. కాసేపు నా వంకా పుస్తకం వంకా చూసి "ఏంటి చదువుతున్నారు?" అని అడిగాడు. ఏదో ఇంగ్లీషు పుస్తకం అని చెప్పాను.

"అందులో ఏం వుంది?" మళ్ళీ అడిగాడు.

ఏం చెప్పను? హింసా స్వభావాన్ని గుర్చి చెప్పాలి. అతనికి అకారణంగా మొగుడు పెళ్ళాన్ని తన్నడం హింస అని చెప్పొచ్చు. మొగుడి బాధలు తట్టుకోలేక బావిలో దూకడం ఆత్మహింస అని చెప్పొచ్చు. ఏభయి రూపాయల కన్సల్టింగ్ ఫీజు లేకపోతే కటిక పేదవాడి వంకయినా కన్నెత్తి చూడని డాక్టరు చేసే వైద్యం హింస అని చెప్పొచ్చు. బక్కచిక్కిన రిక్షావాడి రక్తం పిండే నూటికి పది రూపాయల మార్వాడీ వడ్డీ హింసఅని చెప్పొచ్చు. నిరంతరం నెత్తురోడ్చే రైతు అప్పుల్లో పుట్టి అప్పుల్లో పెరిగి అప్పుల్లోనే చావవలసి రావడం హింస అని చెప్పొచ్చు.మరేదైనా ఎందుకైనా హింస అని చెప్పొచ్చు.

అయితే నా మాటలు అతనికి ఎంతవరకు అందుతాయోనని సందేహించాను. అయినా రెండు మూడు ముక్కల్లో నా భావాల్ని జార్జి విల్సన్ భావాల్ని విడమర్చి చెప్పాను. అతను ఒక్క నిమిషం మౌనంగా వుండి "నేనో సంగతి చెప్తాను. వింటారా?" అన్నాడు.

"తప్పకుండా" అన్నాను. హాస్పిటల్ ప్రశాంతంగా వుంది. అతని భార్య లోపల నిద్రపోతున్నట్టుంది. అతను తన కథ ప్రారంభించాడు.

అతని పేరు వెంకటేశ్వర్లు. వాళ్ళది మాచర్ల దగ్గర చిన్న పల్లెటూరు. తాతల కాలంలో వాళ్ళకి నాలుగెకరాల పొలం వుండేది. తండ్రి తరానికి అది రెండెకరాలయింది. వెంకటేశ్వర్లు చిన్నతనంనాటికే కుటుంబం అప్పుల్లో వుంది. అనావృష్టివల్ల పంటలు దెబ్బతినడం, పంట పండినా అది అప్పులు తీర్చడానికే సరిపోకపోవడం, పొలం కోసం ఇంట్లో జరుగుబాటు కోసం మళ్ళీ మళ్ళీ అప్పు చెయ్యడం ఆనవాయితీగా వుండేది. అప్పులవాళ్ళు ఇంటి మీద,మూగినప్పుడు తండ్రి ముఖం చాటు చేస్తుండేవాడు. పిల్లల్ని కనడమే తప్ప వాళ్ళకి చదువు సంధ్యలు చెప్పించే స్తోమత లేకుండా పోయింది. పసి పిల్లల్ని తనతో పాటు పొలం పనికి తీసుకువెళ్తుండేవాడు. తండ్రి మరణించేనాటికి ఎకరం పొలం మిగిలింది. కుటుంబ బాధ్యత అంతా వెంకటేశ్వర్లు నెత్తిమీద పడింది. అప్పటి కతనికి పదిహేనేళ్ళు. తల్లి రోగిష్టిది. నలుగురు చెల్లెళ్ళు. చిన్నవాళ్ళు. కుటుంబంలో తల్లితో సహా అందరూ పొలంపనికీ, కూలి పనులకీ వెళితే తప్ప ఏరోజుకారోజు జరిగేదికాదు .రేపెలా బతకాలి అనేది ప్రతిరోజూ ఎదురయ్యే ప్రశ్న.

ఇలా వుండగా ఒకనాడు రోడ్డు పనికి వెళ్ళిన రెండో చెల్లెల్ని ఎవడో బలవంతంగా చెరిచాడు. ఆ అవమానం భరించలేక ఆమె బావిలో దూకి చనిపోయింది. ఆ దిగుల్తో వారం గడవకముందే తల్లి మరణించింది. దెబ్బమీద దెబ్బ తగిలినా కన్నీరా ఏడవడానికూడా తీరికలేని బతుకు. తక్కిన ముగ్గురు చెల్లెళ్ళని కడతేర్చవలసిన బాధ్యత మిగిలేవుంది. ముక్కీ మూలిగి ఇద్దరి పెళ్ళిళ్ళు ముగించేసరికి చేతిలోని ఎకరం పొలం రెక్కలొచ్చి ఎగిరిపోయింది. రోజువారీ రెక్కలకష్టమే సంపాదన. చివరి చెల్లెలి పెళ్ళికోసం ఊళ్ళోని డబ్బున్న పెద్దమనిషి దగ్గర నోటురాసి మూడువేలు అప్పుతెచ్చాడు వెంకటేశ్వర్లు. ఎలాగో చెల్లెళ్ళ బాధ్యత వదుల్చుకోగలిగినా పెరుగుతున్న అప్పు తీర్చవలసిన అవసరం అలానే వుండిపోయింది. మళ్ళీ విశ్రాంతి లేని బతుకు పోరాటం. ఎలాగైనా అప్పు తీర్చాలి. ఇల్లు నిలుపుకోవాలి. వెంకటేశ్వర్లు భార్యతోపాటు రాత్రింబవళ్ళు గొడ్డుచాకిరీ చేశాడు.

ఎర్రని ఎండల్లో గడ్డ విరిచాడు. కోత పనుల కెళ్ళాడు. కొన్నాళ్ళు టాపీ పని కూడా చేశాడు. కడుపు కట్టుకుని రెండేళ్ళకి కొంత డబ్బు కూడబెట్టగలిగాడు. కానీ అప్పు ఇచ్చిన పెద్దమనిషి నిలువునా ముంచుతాడని కల్లో కూడా ఊహించలేకపోయాడు. బాకీ తీర్చబోతే దొంగ నోటులో అసలుకే పదివేలు వున్నట్టు తేలింది. వెంకటేశ్వర్లు నెత్తీనోరూ బాదుకున్నా ప్రయోజనం లేకపోయింది. కొంప గుండమైంది. భార్య మంచమెక్కింది. వెంకటేశ్వర్లుకి ఏం చెయ్యాలో తోచలేదు. వెర్రికోపంతో ఒక రోజు రాత్రి గొడ్డలితీసుకుని అతన్ని నరికేద్దామని ప్రయత్నించాడు. అతను గాయపడి ప్రాణాల్తో తప్పించుకున్నాడు. వెంకటేశ్వర్లు హత్యకేసులో ఇరుక్కుని రెండేళ్ళు జైల్లో గడిపాడు. ఆ రెండేళ్ళు అతని భార్య ఎంత నికృష్టపు బతుకు బతికిందో ఊహించడమే భయంకరం. వెంకటేశ్వర్లు జైలునుంచి వచ్చేసరికి భార్య ఆరోగ్యం బాగా క్షీణించింది. అప్పుకింద

ఇల్లు వేలం అయింది. ఉన్న వూళ్ళో పసుపు పోయింది. వెంకటేశ్వర్లు భార్యతో పట్నం వచ్చాడు. కొన్నాళ్ళు రిక్షా లాగాడు. ఇంకొన్నాళ్ళు జూట్ మిల్లులో పనిచేశాడు. ప్రస్తుతం మార్కెట్ వద్ద హమాలీ పనిచేస్తున్నాడు. ఏ రోజు బ్రతుకుతెరువు ఆ రోజు చూసుకోవలసిన పరిస్థితి. భార్య రోగానికి సరైన వైద్యం చేయించలేకపోయాడు. చివరికి జబ్బుబాగా ముదిరింతర్వాత హాస్పిటల్‌కి తీసుకురాక తప్పలేదు. తగ్గుతుందని నమ్మకం లేదు. తగ్గించడానికి డబ్బూలేదు.

చాలా సాధారణంగా తన కథంతా చెప్పుకుపోయాడు వెంకటేశ్వర్లు. చెబుతున్నంతసేపూ చిరునవ్వు తప్ప మరే భావమూ అతని ముఖంలో కన్పించలేదు. కానీ అతని మాటల వెనక ఎంతో బాధ. కసి గూడు కట్టుకున్నట్టు తెలుస్తోంది. ఇంతలో లోపల్నుంచి అతని భార్య దగ్గు విన్పించింది. వెంకటేశ్వర్లు లేచి లోపలికి వెళ్ళాడు.నా మనస్సు పుస్తకం మీద లగ్నం కాలేదు. హింసా స్వరూపం ఎలాంటిదో అతని కథ చెబుతోంది. మనిషి పుట్టింది మొదలు చచ్చేదాకా క్షణ క్షణం శ్రమిస్తున్నా ఎప్పటికప్పుడు తన ఉనికికి సంబంధించిన ప్రశ్న నెదుర్కొనవలసి రావడం సమాజంలోని హింసా స్వభావమే. ఈ అంశాన్ని జార్జి విల్సన్ ఎక్కడా ప్రస్తావించినట్టు లేదు.

సాయంకాలం డాక్టరు గారమ్మాయి మమ్మల్ని చూడ్డానికి వచ్చింది. ఇరవై ఏళ్ళుంటాయి. కొట్టొచ్చే అందం కాకపోయినా తీరైన పోషణ వల్ల ముఖంలో కళాకాంతులున్నాయి. సుగుణని పరామర్శించిన తర్వాత ఆ రాత్రి తమ ఇంటికి భోజనానికి రమ్మని నన్ను ఆహ్వానించింది. నేను తటపటాయించాను. డాక్టరు గారమ్మాయి స్వయంగా మా వద్దకి వచ్చినందుకు సుగుణ ముఖంలో రవంత స్వాతిశయంతో కూడిన సంతోషం తొణికిసలాడుతోంది. "అంత అభిమానంతో పిలుస్తుంటే బెట్టు చేస్తారేమిటండీ"అని మందలించింది.

హాస్పిటల్ కాంపౌండ్‌లోనే వుంది డాక్టర్ మేడ. మేడ ముందు లాన్స్‌లో రకరకాల పూల మొక్కలు గాలికి తలలూపుతున్నాయి. ఏదో క్రీపర్ మేడమీదకు అల్లుకొని సువాసనలు వెదజల్లుతోంది. డాక్టరే నన్ను రిసీవ్ చేసుకున్నాడు. మేడంతా తిప్పి చూపించాడు. ఆరు పోర్షన్లుగా వుంది. ప్రతి గదికీ మొజాయిక్ ఫ్లోరింగ్. ముందు హాల్లో ఖరీదైన సోఫా సెట్టు.టీ. వీ. ఫ్రిజ్ వగైరా సరంజామాకి లెక్కలేదు. మొత్తంమీద మేడ అందంగా వుంది. అధునాతనంగా వుంది. ఖరీదుగా వుంది. నా వుద్యోగం జీతమంతా కలిపినా ఆ మేడలో సగం కట్టించడానికి చాలదు. భోజనం ఏర్పాట్లు అంత ఘనంగా చేస్తారనుకోలేదు నేను. విశాలమైన డైనింగ్ టేబుల్‌మీద రకరకాల పిండివంటలు-నాకు పేర్లు కూడా తెలీనివి కొన్ని - తీర్చి వున్నాయి. తినకపోయినా చూస్తుంటేనే చాలు అన్నంత ఆకర్షణీయంగా వున్నాయి. ఏ పదార్థంతో మొదలుపెట్టాలో నాకర్థం కాలేదు. చిత్రకారుడు రంగుల్లో కుంచె ముంచినట్టుగా కొన్ని పదార్థాల్ని కేవలం వేలితో రుచి చూసి వదిలివేశాను. ఎంతో స్టేటస్ కాన్షస్‌నెస్‌తో ఏర్పాటు చేసిన విందు అది. భోజనాలు ముగిసిం తర్వాత డాక్టర్ కాసేపు నాతో పిచ్చాపాటీ మాట్లాడాడు. మాటల సందర్భంలో ఒక ఫొటో చూపించి "ఎలా వున్నాడు కుర్రాడు?" అని అడిగాడు. ఫొటోలోని వ్యక్తి అందంగా, హుందాగా వున్నాడు.

"ఊటీ అంటే నా కిష్టం. చాలా చల్లగా, హాయిగా ఉంటుంది."

"ఊటీకి నీ వెప్పుడూ వెళ్ళలేదుగా."



"నే వెళ్ళానని అనలేదే. ఊటీకి వేసవిలో నా భార్యా పిల్లలూ వెళ్ళారు. నా కప్పుడిక్కడ హాయిగా ఉందన్నాను."

—బాగాపురం నాగేశ్వరరావు, గద్వాల్

"ఆ సీ, అందమూ అన్నీ వున్నాయి. ఇంజనీర్. బట్ షి ఈజ్ టోటల్లీ డిసింటరెస్టెడ్. ఫారిన్ వెళ్ళాల్సిందే నట. ఏ డాక్టరుకో ముడేసి అమెరికా పంపిస్తే ఓన్లీ డాటర్ గదా, మాకెలా వుంటుంది? ఐడోంట్ నో హౌ టు టాకిల్ దిస్ ప్రాబ్లమ్. మీరే చెప్పండి. ట్రై టు కన్విన్స్ హర్" అన్నాడు డాక్టర్.

"ఇక్కడే ముంది? డర్టీ ఇండియా. నేనెలాగైనా ఫారిన్ వెళ్ళాల్సిందే. మీరైనా చెప్పండి మాస్టారూ!" అంది డాక్టరు గారమ్మాయి.

నాకే మనడానికీ తోచక నవ్వి ఊరుకున్నాను. కాసేపటికి సెలవు తీసుకుని వచ్చేశాను. 16వ నెంబరుగదిముందు వరండాలో వెంకటేశ్వర్లు మౌనంగా కూర్చుని వున్నాడు.

"భోజనమైందా?" అని ప్రశ్నించాను.

వెంకటేశ్వర్లు సమాధానంగా నవ్వాడు. నల్లటి మొహంలో అదే తెల్లటి చిరునవ్వు. రోజూ అతనే భార్యకి వంట చేసి పెడుతున్నాడు. నేను గదిలో అడుగుపెట్టేసరికి డాక్టరు కుటుంబ విషయాలూ ఇంటి సంగతులూ అడగడానికి సుగుణ రెడీగా బెడ్‌మీద కూర్చుని వుంది. ఏదోచెప్పి నిద్ర కుపక్రమించేటప్పటికి సుగుణ చెప్పింది— ఆ పూట పక్కగదిలో వెంకటేశ్వర్లు భార్యకి వండిపెట్టి తను పస్తున్నాడని.

"ఎందుకని?" ఆశ్చర్యంగా అడిగాను.

"ఎందుకేమిటి? ఏదో రకంగా కొంచెం డబ్బు మిగిల్చి బిల్లు చెల్లించడానికి" అంది సుగుణ.

"నీ కెలా తెలిసింది?"

"ఇలాంటి విషయాలు మాకు తొందరగా తెలుస్తాయిలెండి."

నాకు కడుపులో దేవినట్టు వోమిటింగ్ సెన్సేషన్ మొదలయింది. డాక్టరింట్లో తిన్న లడ్లు, తాగిన పాయసాలు,తినకుండా మిగిల్చిన ఎన్నో భోజన పదార్థాలు ఒక్కసారి కళ్ళముందు కనబడ్డాయి. డాక్టరుగారమ్మాయి ఎంత నాజూగ్గా వాటిని రుచిచూసి వదిలేసింది? సంప్చ్యుయస్ ఫీస్ట్....ఆకలితో పస్తు. ఖరీదైన అల్లుడి సమస్య....కాలే కడుపు సమస్య....ఉనికే ఒక సమస్య విచ్చిన కందని అంతరాలు.

* * *

డాక్టర్ చాలాజాగ్రత్తగా సుగుణకి ట్రీట్‌మెంట్ ఇస్తున్నాడు. ఆయన సంభాషణ కూడా సరదాగా వుంటుంది. కానీ మావద్ద ఎంతో ప్రసన్నంగా వుండే ముఖం పక్కగదికి వెళ్ళగానే కొంచెం చిరాగ్గా మారుతుంది. వెంకటేశ్వర్లు భార్య ఏకరువుపెట్టే బాధల్ని సీరియస్‌గా తీసుకుని ట్రీట్ చేద్దామనే దృష్టి అంతగావున్నట్టు కనిపించదు. రోజురోజుకిఆమె జబ్బు ముదిరిపోతున్నట్టు తెలుస్తోంది. ఆయాసం, ఛాతీలో నొప్పి, ఎడతెగని దగ్గు, దగ్గుతో పాటు రక్తం పడటం మామూలయింది. ఆమె బతుకు రోజుల్లో వున్నట్టు చెప్పాడు డాక్టర్. అయినా ప్రతిక్షణం ఆమె మృత్యువుతో సాగించే పోరాటం కళ్ళబడుతూనే ఉంది. మనిషి మృత్యువు చేతులో ఓడిపోతూ నరక యాతనతో మరణభయంతో రోజులు గడిపే స్థితి కంటే దారుణం మరొకటి లేదు.

ఉదయమే కాంపౌండర్ వచ్చి సుగుణకి సెలైన్ పెట్టి ఎటో వెళ్ళిపోయాడు. బాటిల్ పూర్తి కావస్తున్నా అయిపు లేదు. గాభరాగా హాస్పిటల్ అంతా గాలించి హనుమంతరావును పట్టుకున్నాను. ముప్పై అయిదో నంబరు గదిలో రోగికి ఇంజక్షన్ చేస్తున్నాడు. వెంటనే హడావుడిగా వచ్చి నీడిల్ తప్పించి బాటిల్ తీసేశాడు. సుగుణ కాంపౌండర్ని కోప్పడింది.

"ఇంత నిర్లక్ష్యం అయితే పేషెంట్స్ ఎలా బతుకుతారు? డాక్టర్‌గారికి చెబుతానుండు ఈ సంగతి" అంది.

హనుమంతరావు చిన్నబోయాడు.

"ఏం చెయ్యమంటారమ్మా? ఈ వింగు మొత్తం నేనే కవర్ చెయ్యాలి. పేషెంట్స్‌కి ఇంజక్షన్స్ దగ్గర్నుంచి అన్నీ నేనే చూసుకోవాలి. ఉదయం నుంచి రాత్రిపదింటి దాకా తీరికే వుండదు. డాక్టరుగారు ఇంకో కాంపౌండర్ని వెయ్యరు-ఖర్చు ఎక్కువవుతుందని. ఇంతా చేస్తే నెలకి మూడువందలిస్తే మహాభాగ్యం" అని ఏకరువుపెట్టాడు.

"మూడొందల్తో నీ కుటుంబం అంతా ఎలా జరుగుతుంది?" నేనడిగాను.

"పొద్దున్నే ఒకసారి సైకిల్ వేసుకుని ఈ చుట్టుపక్కల లేబర్ లొకాలిటీ తిరుగుతాను. హాస్పిటల్‌కి వచ్చి ఫీజు చెల్లించుకోలేని వాళ్ళంతా నా గిరాకీ. వాళ్ళకి నాకు తెలిసిన వైద్యం చేసి నాలుగు రాళ్ళు సంపాదిస్తాను. ఇక పేషెంట్స్ వెళ్ళేపుడు పదో పరకో చేతిలో పెడతారు. ఏదో ఇట్లా గడిచిపోతోంది" అని మరేదో చెబుదామా వద్దా అన్నట్టు సందేహించి మళ్ళీ ప్రారంభించాడు హనుమంతరావు.

"డాక్టర్‌గారు ఈ హాస్పిటల్ కట్టించక ముందు నుంచీ నాకు తెలుసు. ఒక్కో పేషెంట్ దగ్గర ఎంత వసూలు చేస్తారో లెక్కేలేదు. మీకు తెలుసుగదా, కన్సల్టింగ్ ఫీజ్ యాభై రూపాయలు. డబ్బున్నవాళ్ళకి ఎక్కువ టాక్స్‌పడుతుంది. బిల్లులో పైసా తగ్గించేదిలేదు. పదేళ్ళనాడు డాక్టర్‌గారిది చిన్న క్లినిక్. ఈ రోజున బ్రహ్మాండమైన హాస్పిటల్ కాంప్లెక్స్. తరాల తరబడి తిన్నా తరగని ఆస్తి. డాక్టరుగారమ్మాయికి పదిలక్షలు కట్నం ఇస్తారట. ఈ బిల్డింగ్ ఎదుట కనబడే ప్లాట్లన్నీ ఆయనవే. ఇక పొగాకు కంపెనీల్లో, జిన్నింగ్ మిల్స్‌లో షేర్లు ఎన్నున్నాయో ఎవరికి తెలుసు! చూస్తుండగానే ఆయనలా పైకెళ్ళిపోయారు. నేనిలా వుండిపోయాను." అని నిట్టూర్చాడు.

నాకంత విలువైన ఆతిథ్యం ఇచ్చిన డాక్టర్ని అసహ్యించుకోవాలో, హనుమంతరావు పరిస్థితికి సానుభూతి చూపాలో నాకు వెంటనే తోచలేదు. కాంపౌండర్ వెళ్ళిపోయిన తర్వాత అతని పరిస్థితికి జాలిపడింది సుగుణ. ప్రతి మనిషికీ ఏవో సమస్యలుండటం సహజమే. అయినా ఆ సమస్యల సామాజిక మూలమేమిటో గ్రహించలేకపోతే ఆ మనిషి బతుకు మనకి అర్థంకానట్టే లెక్క. ఆ దృష్టితో చూస్తే సుగుణకి డాక్టర్‌గానీ కాంపౌండర్‌గానీ వెంకటేశ్వర్లుగానీ అర్థంకాలేదనే చెప్పాలి.

సాయంకాలం కూరగాయల కోసం మార్కెట్‌కి వెళ్ళాను. తిరిగి వస్తుండగా మార్కెట్ ముందు వెంకటేశ్వర్లు తారసపడ్డాడు. వీపుమీద ఏదో కూరగాయల బస్తా లోపలికి మోస్తున్నాడు. చిల్లులు పడ్డ బనీను మురికి ఓడుతున్న పంచెతో వున్నాడు. గడ్డం బాగా పెరిగిపోయింది. చెమటతో

రోజూ పడుకోబోయేముందు తన భార్యకు ఇలా చెప్పేవాడాకాయన. "గుడ్ నైట్ డార్లింగ్. నలుగురు పిల్లల తల్లీ



గుడ్‌నైట్" అని. చిర్రెత్తుకొచ్చిన ఆమె "గుడ్‌నైట్. నలుగురిలో ఇద్దరు పిల్లల తండ్రీ గుడ్‌నైట్." అని అంది.

—చాగాపురం నాగేశ్వరరావు, గద్వాల్

కలిసి ఒళ్ళంతా దుమ్ము పేరుకుపోయి వుంది. నన్ను చూడగానే అతనిముఖంలో ఎప్పటిలాగే చిరునవ్వు కనిపించింది.

"అదేమిటి? ఆవిణ్ణి అక్కడ ఒంటరిగా వదిలేసి ఇట్లా వచ్చావు?" అని అడిగాడు.

"ఆవిడకోసమే" అన్నాడు క్లుప్తంగా.

"వస్తు లుంటున్నావటగా?"

"తప్పనప్పుడు."

నేనెందుకో గిల్టీగా ఫీలయ్యాను! డాక్టరింటికో విందు గుర్తువచ్చినందువల్లనేమో ఇంకేమీ మాట్లాడలేక వచ్చేశాను.

నన్ను మార్కెట్‌లో చూసినప్పటి నుంచి వెంకటేశ్వర్లే అప్పుడప్పుడూ కూరగాయలు తెచ్చిపెడుతూ వున్నాడు. అతను చేస్తున్నది ఎంతో చిన్న సహాయమే అయినా దాని వెనక అతని మనస్తత్వం నన్నెంతో ఆకర్షించింది. భార్య ఆరోగ్యం గురించి ఎంతగా ఆందోళన పడుతున్నాడో నాకయితే తెలీదుగానీ పైకి మాత్రం నిబ్బరంగానే కనిపిస్తున్నాడు. పొద్దున్నే భార్యచేత ముఖం కడిగించి స్నానంచేయించడం, మందులు మింగించడం, వంటచేసి పెట్టడం, ఆమె నోటి వెంట కళ్ళెతో పాటు రక్తం పడ్డప్పుడు, ఏమాత్రం అసహ్యం లేకుండా శుభ్రం చెయ్యడం మొదలయిన పనులన్నీ నిర్లిప్తంగా దీక్షగా చేసుకుపోతున్నాడు. పగలంతా అతని భార్య అశాంతిగా పక్కమీద పొర్లుతూ దగ్గుతూ వెంకటేశ్వర్లు కోసం ఎదురుచూస్తూ వుంటుంది. ఆమె గాజుకళ్ళు, ఎముకల కంటుకుపోయిన శరీరం నన్ను భయపెడతాయి. అప్పుడప్పుడు సుగుణ ఆ గదిలోకి వెళ్ళి ఆమెని పలకరించి వస్తుంది.

* * *

"రెండు మూడు రోజుల్లో మీరు డిశ్చార్జ్ కావచ్చు. ఇన్‌ఫెక్షస్ జాండీస్ కాబట్టి తొందరగానే తగ్గిపోయింది" అన్నారు డాక్టర్.

ఎల్.ఎఫ్.టి. రిపోర్టు ఒకటి పాయింట్ ఐదు చూపిస్తోంది. మా గుండెలు తేలికపడ్డాయి. పదిహేను రోజులపాటు ఇంటికి దూరంగా వుండటం సుగుణకు చాలా కష్టంగా వుంది. ఇన్నిరోజులూ ముళ్ళమీద కూర్చున్నట్టే గడిపింది. సుగుణ డిశ్చార్జ్ కాబోతుందని తెలిసి వెంకటేశ్వర్లు సంతోషించాడు. మరుక్షణంలో అతని ముఖంలో ఏదో దిగులు తారట్లాడింది. అది తన భార్యను గూర్చిన ఆలోచనలు.

ఆ రాత్రి ప్రశాంతంగా నిద్ర పట్టింది. కానీ మూడు గంటలవుతుండగా హఠాత్తుగా ఎవరో తట్టినట్టు మెలుకువ వచ్చింది. పక్కగదిలోంచి వెంకటేశ్వర్లు భార్య విపరీతంగా దగ్గుతూ ఊపిరాడక అయాసపడుతున్నట్టు వినిపిస్తోంది. ఎందుకో కీడు శంకించాను. వెంటనే లేచి పక్కగదిలోకి వెళ్ళాను. పక్కమీద తెరలు తెరలుగా దగ్గుతూ ఊపిరాడక మెలికలు తిరిగిపోతోందామె. దీనంగా బాధాకరంగా భయంకరంగా పేగుల్ని చీల్చుకు వస్తున్న దగ్గు అది. నోటి వెంట చుక్కలు చుక్కలుగా రక్తం కారుతోంది. వెంకటేశ్వర్లు భార్యను పట్టుకుని వణికిపోతున్నాడు. నేను కనిపించగానే వెంకటేశ్వర్లు ఆవిణ్ణి వదిలేసి నా వంక తిరిగాడు.

"మీరు కాస్త చూస్తుండండి. నే వెళ్ళి డాక్టరుగార్ని పిలుచుకొస్తాను" అంటూ నా సమాధానం కోసం ఆగకుండా బయటికి పరిగెత్తాడు. నే నామెని పట్టుకుని జాగ్ర

## సాహితీ క్విజ్
### (నాటకరంగం)

1. ఎన్.జి.వో.—నాటకంలో ఆత్రేయ చిత్రించిన ఇతివృత్తం స్థూలంగా ఏమిటి?
2. అంతర్జాతీయ భాషల్లోకి అనువాదం పొందిన ఎన్. ఆర్. నంది ఒక నాటకం పేరు?
3. అంతర్ కళాశాలల పోటీల్లో అత్యధిక బహుమతులు పొంది, ప్రప్రథమంగా మద్రాసు కళాసాగర్ ఆహ్వానాన్ని పొందిన నాటిక ఏది?
4. ప్రజా నాట్యమండలి ఆవిర్భవించిన సంవత్సరం?
5. స్త్రీలే స్త్రీ పాత్రలు ధరించాలని చెప్పి ఆచరించిన ప్రముఖ రంగస్థల నటుడు, నాటకాల్లో ప్రయోక్త?
6. 'లిటిల్ థియేటర్' ఉద్యమకర్త ఎవరు?
7. తెలుగు నాటకరంగ చరిత్రలో ఒక నాటకం దేశాన్నే ఉర్రూతలూగించింది—ఆ నాటకం రచించిన జంట రచయితలెవరు? ఆ నాటకం పేరేమిటి?
8. వైద్యుడుగా-స్టేజీ-సినిమా నటుడుగా సంచలనం సృష్టించిన తెనాలి నటుడు.
9. కళాశాలల్లో-ముఖ్యంగా ఆంధ్ర ప్రాంతంలో విద్యార్థులకు నాటకకళ పట్ల అభిరుచి కలిగేందుకు దోహదం చేసిన ఆక్స్‌ఫర్డ్ మాస్టర్.
10. 'మేల్ ఇన్ ఫిమేల్ రోల్స్'లో ప్రఖ్యాతుడైన రంగస్థల తొలి 'పద్మశ్రీ.'

నిర్వహణ:
ఎమ్.డి. సౌజన్య

## సాహితీ క్విజ్
### (కవితాలోకం)
### (గతవారం సమాధానాలు)

1. పోతన
2. బాలగంగాధర తిలక్
3. 1965 మే అర్ధరాత్రి 12 గంటలకు
4. వరవరరావు
5. దిగంబర కవులు
6. 1970 ఫిబ్రవరిలో-విశాఖపట్టణంలో
7. ఓ కూనలమ్మ-ఆరుద్ర
8. కాళోజీ
9. వేగుంట మోహన్‌ప్రసాద్
10. డాక్టర్ సి. నారాయణరెడ్డి

త్తగా పడుకోబెట్టాను. చేతికందిన గుడ్డతో పెదాల వెంట కారుతున్న రక్తం తుడిచాను.

"నేనింక బతకను.... పాపిష్టిదాన్ని.... నా మూలంగా ఆయనకన్నీ కష్టాలే." అందామె దగ్గు తెరల మధ్య ఆయాస పడుతూ.

అవే నేనామె నోటివెంట విన్నమాటలు. కాసేపటిలోనే వెంకటేశ్వర్లు విచారంగా తిరిగి వచ్చాడు. నేను ప్రశ్నార్థకంగా చూశాను.

"ఆయన రాడంట. రోజూవున్న కొలువు కోసం నిద్ర దండగెందుకన్నాడు. ఏందో మూడు మాత్రలిచ్చి మొహంమీదే తలుపేసేశాడు" అని చెప్పాడు నిరాశగా.

ఆ సమయంలో డాక్టరంటే నాకెంతో అసహ్యం వేసింది. ఫారిన్ నుంచి పెళ్ళి కొడుకు వచ్చాడంటే అర్ధరాత్రి అయినా పరిగెత్తుకు వచ్చేవాడని నాకు తెలుసు. ఆ మాత్రలకి ఆమె బాధ తగ్గలేదు. మెల్లగా మగతలోకి జారుకుంది. ఎండిపోయిన రొమ్ములు ఎగశ్వాస దిగశ్వాసల్లో ఎగిరి పడుతున్నాయి. మృత్యువు నీడ ఆమె ముఖాన్ని ఆవరించింది. మరో అరగంటలోనే ఆమె మరణించింది. భర్త చెయ్యి ఆమె చేతిలోనే వుంది. వెంకటేశ్వర్లు కళ్ళ వెంట నీటిచుక్కలేదు. కానీ లోలోపల అతను కుమిలి కుమిలి ఏడుస్తున్నట్లు నివ్వుముద్దలా జేవురించిన అతని ముఖమే చెబుతోంది.

ఆ తర్వాత జరిగిన తతంగం వివరించడానికి నాకు మాటలు చాలవు. బిల్లుచెల్లించి శవాన్ని తీసుకెళ్ళమని డాక్టర్ ఎంతో మర్యాదగా చెప్పాడు. బిల్లు మొత్తం చెల్లించడానికిగానీ, భార్య శవాన్ని తన వూరు తీసుకెళ్ళి దహనకాండ చెయ్యడానికి గానీ వెంకటేశ్వర్లు దగ్గర తగినంత డబ్బులేదు. నా వద్ద కొంత సహాయం తీసుకున్నాడు. పగలంతా ఎక్కడెక్కడో తిరిగి సాయంకాలానికి మరికొంత డబ్బుతో తిరిగొచ్చాడు. అది డాక్టర్ బిల్లుకి బొటాబొటీగా సరిపోయింది. అప్పటికప్పుడే మేం వారిస్తున్నా వినకుండా నోరు తెరుచుకు భయంకరంగా వున్న భార్య శవానికి గుడ్డకప్పి భుజాన వేసుకు వెళ్ళిపోయాడు. ఎర్రబడ్డ కంటి చూపుల్తో మొహాన అదే చెదరని నవ్వుతో నాదగ్గర సెలవు తీసుకున్నాడు. ఆ చూపుల్ని ఆ నవ్వునీ నేనెప్పటికీ మర్చిపోలేను. మరునటిరోజున హాస్పిటల్‌కి దూరంగా పొలాల పక్క గోతిలో ఎవరిదో శవం వుందని, దాన్ని కుక్కలు పీక్కు తింటున్నాయనీ తెలిసింది నాకు!

ఇక వెంకటేశ్వర్లు ఆత్మహత్యే చేసుకున్నాడో ఇంకా వెన్ను విరిగేలా బరువులు మోస్తున్నాడో లేక ఏ గునపాన్నో చేతబూని వికృతంగా బిగుసుకుపోయిన సామాజిక చట్రాన్ని బద్దలు కొడుతున్నాడో నాకిప్పటికీ తెలీదు.

నాకు హాస్పిటల్ అంటే, అందులో మృత్యువు వాసన వేసే రోగులంటే, రోగుల వ్యాధులంటే అసహ్యం తొలగిపోయింది. మనిషిని పీడించే మరేదో సామాజిక వ్యాధిపట్ల ద్వేషం ప్రబలింది. హాస్పిటల్ నుంచి మేం వెళ్ళిపోతున్నప్పుడు ఎక్కడో దూరం నుంచి గాలి తెరల్లో కలిసి ఏదో వెగటు పుట్టించే వాసన ముక్కుకి సోకింది. అది వెంకటేశ్వర్లు భార్య శవం కుళ్ళిన వాసనైనా కావచ్చు. లేదా వ్యవస్థలోని కుళ్ళు తాలూకు దుర్గంధమైనా కావచ్చు.